" గంజైతే కుసింత పొయ్యి ! వర్రుందా ఉప్పుందా ?" అని అడిగేరు ఉప్పర్లు. " ఉప్పు వానకు కరిగి నీరై పోనాది. వర్ర తొర్రలోవుంది. గంజి అయ్యేని ! నావో గుప్పెడు ' ఎఱడా ' బియ్యంవుంటే, ఒంటిపట్టు వెనల్లో పోశా " నంది. " బతికించావు మామ్మా !" అన్నారు, వాళ్ళిద్దరూను. " గందే పూడ్చమా? కడుపునిండే పొలమే మాడ్చమా మాం వుప్పరులం; గండిలు పూడ్చడానికే పుట్టాం ! ఉప్పు మా పేరులోనే వుంది. సప్పనైతే అయిందిగాని పప్పూకూడంత వెచ్చెచ్చగా వుంది—ఇంకా కుసింతగంజి పొయ్యి !" అనే వాళ్ళవూసు నేను వారి నుండి దూరమయ్యేలో, ' హారన్ ' కొట్టినట్టు వినవచ్చింది.

నామనస్సులో ఒక మాదిరి మాంద్యం బయలుదేరింది. కష్టపడేవానికి ఇల్లుకట్టి ముందు ఇవ్వాలా ? నష్టపోయినవానికి పుష్టి గొలపాలా ? నష్టపోయినవాడొకప్పుడు కాకపోతే ఒకప్పు డన్నా నవనాగరీకత ఎరిగున్నవాడు. వీడసలే ఎరుగడు, వీణ్ణి చూచేదెవరు ? అని అనుకొంటూ, అంతులేని రాజమార్గాన్నే నడిచేను వానిచివర స్వర్గముందా అన్నట్టు !

.... .... .... .... ....

## ఆ రోజుల్లో విన్న సంగతిమీద ఈ రోజుల్లో ఓ కల

పై పేరుతో ఒక కథ నేడు వ్రాయగల్గుతూ వున్నామూ అంటే—మావసతిగృహానికి వరద అనంతరం కొత్తగా దరుజుచేసి వెల్లవేయబట్టి అనుకోండి ; మతిస్నీ శరత్కాలంకూడావచ్చింది. చిరుచలి ప్రారంభించింది తెల్లవాఱగట్ల. ఇంకా అనుకూలమైన

దేశకాల పాత్రలను వివరించవలసివస్తే. నూతనంగా ఆంధ్ర రాష్ట్రం వచ్చింది. పగలు తెల్లటి మేఘాలు దూదికొండల్లా ఆకాశంమీద నిలబడివుంటూ వున్నాయి. అమావాస్య రాత్రిళ్ళు చుక్కలు మింట ప్రకాశమానంగానూ, ఆ చుక్కలన్నీ అన్నింటినీ కలోసి జుట్లు ముళ్ళేట్టి, మూటకట్టి. అద్దపుబరణిలో క్రిక్కిరిసే లాగు నక్కింపజేసినట్టు పవర్ణ మీదేవి, పూరా చంద్రబింబం పరిఢవిల్లేని. మరీన్నీ దసరా వుత్సవాలు అవుతూన్నాయి. సరస్వతీ పూజలు, దుర్గారాధనలు, గిలకల పండగలు, వీర వినోదాలు ఇవన్నీ ఆరేలకు ముఖ్యాంగాలుగావుండి వేడుక గొల్పుతూన్నాయి. నేనున్న ఒక తెల్లవారుజామున " రగ్గు " కాళ్ళమీదకు తీసుకుని, లోపల గుండెకాయ " లబ్ డబ్ " దెబ్బలిస్తూవుంటే, జోకొట్టులా, కళ్ళు మూసుకుంటూ కలకంటూ వున్నాను.

కల అంటే కలకాల ముండేదానిలా తోచింది. మీరంతా " కల " అంటే అప్పటికప్పుడు కనబడి హారతికర్పూరపు హారతిలా అంతమంది పోయేనవి అనుకుంటారులాగుంది. అలాంటి కలకాదు నాది. నాకలలో మనుష్యులు తల్లక్రిందులుగా నడచేరు. అవ్యక్తంగా మాటాడేరు. నేనూ నా ప్రకృతిరూపంలో వారి నర్థంచేసుకుంటూ, ఈ శరీరంయొక్క వేధ మేధ అన్నీ దాటి వేరే గాథలో పడ్డానేమో అన్నట్లు, అన్యథాపాత్రగా ప్రవర్తిస్తూంటాను. పరు దెవదైనా ఆ కలతీరు కన్నాడా, ప్రత్యక్షంగా మంచంమీద నిదరోతూ నేనూ, నేనే ఆవల నాటకంలో పాత్రలాగూ రెండూ ఒకేరకపు శరీరములుగా ఒకే రకపు గొంతుకలు దాల్చివున్నట్టు తోచితీరుతుంది. అయితే నాకు నేనే కలకంటూ వున్నానేమో, అద్దంలో చూచుకొన్నట్టు నారూపు

నాకే కనిపించేది. అంత అలా కనబడ్డా "ఇక్కడ కెల్లా వచ్చావు నీవు ?" అనే ప్రశ్న పొడమలేదు. యంత మమైకంగా ఆ మాయలో పడిపోయి ఆ కర్మకాండను యనుసరిస్తున్నాను.

పర్ణశాలమీద పక్షిగా నిలిచి, పాపికొండలమీద పడవలా గయిపోయి, పట్టిసం ఆ ప్రాంతానికి వచ్చేసరికి కడవలాది కల్లో, బెల్లప్పానకమో అన్నంత నురుగుతో పెరుగుతో వీరభద్రుణ్ణి ముంచెత్తి, ముయ్యేరు కట్టతెగినట్లయి, అయ్యేరు విసురు చూపెడుతూంది. "ఓయి : ఒయ్యోయి !" అంటే, "ఇంకేముంది? ఒయ్యోయి !" అని రయితూలూ, "ఏమల్లోయి! ఏంచేదాం ?" అని పల్లెటూళ్ళ ఆడవాళ్లు, ఆ జనపద ప్రాంతాన్నీ అలజడి పోసాగారు.

అది వుదయమే ! బాగా వెలుగొచ్చింది ! చెట్టూ పిట్టా ఎక్కడున్నది ఏమంటూన్నది తెలుస్తూనేవుంది. "అయితే అంధకారమన్నది ఆరుబయటదికాదు. అంతఃకరణది!" అన్నట్టు ప్రతీ మనిషియొక్క అంతరంగంలోను అదో తరంగము పడి చుట్టి సుడిగుండం తిప్పేస్తున్నట్టు అయిపోయింది.

ఆ పొద్దు ఆమెకు నీళ్ళాడుపొద్దు. నులకమంచంమీద, మోకాల్లోతునీళ్ళల్లో నీల్లాడి పిల్లాన్నికని వొళ్లమఱచివుందన్నారు. మంచంక్రింద కుంపటీ పెట్టడానికి వరదనీరు, మంచంకోళ్ళ ఉసిఉసి కదిలిస్తూంది. లేడీడాక్టరు సాయంపొందడానికి అది గట్టుక్రింద ఎదో పల్లెటిపట్టు. జలం చుట్టు తిరిగి మెట్టెక్కి ఊళ్లో పడిందంట ! ఊరంతా తప్పించుకు, కొందరు తాడిచెట్ల కెగబ్రాకి, కొందరు మఱ్ఱిపూడలట్టుకు వ్రేలాడి, కొందరు ముందఱకువెళ్ళి వెనక్కువచ్చి, "చచ్చామ్రరో" అని కూతేసి,

చావకుండా బ్రతక్కుండా బావురుపిల్లుల్లా, గుంటనక్కల్లా, ఈతబడి ఏర్పాటుగా కాపడేరు.

ఒక్క ఈమే ఎవరికీ అగపించడంలేదు. అప్పుడు పుట్టిన పిల్ల కొత్తనీట తెప్పన తేలిపోతూంటే, తల్లి పురటాలు ముని వ్రేళ్ళమీద నిలబడి బుజాన్ని మోస్తుందా? మోకరించి వేయి దేవుళ్ళకూ మ్రొక్కుతుందా?

ఆమెముందు 'ఏడుకొండలలోడు' ఎత్తుగా సాక్షాత్కరించాడేమో, పురిట్లో పిల్ల నలా త్రోసేసింది. ఆ త్రోపివేత తెగింది తల్లీ పిల్లా యొక్క కలగలపు బొడ్డుప్రేగు. పిల్ల విడివడింది. తల్లి పడిపోయింది. పిల్ల తేల్తూ అరఫర్లాంగు దూరంలో తేరుకుంది. తల్లి తెప్పరిల్లింది. పిల్ల ఫర్లాంగు దూరంలో వరదనే ఎవరిచేతనో పైకెత్తబడి లాలింపబడింది. తల్లి అదోపాలనగా పరకాయిస్తూ బ్రహ్మానందభరితురాలై తన దారి తాను వెతుక్కోసాగింది. నులకమంచం నులకమంచం రేగిపోయి గుడిసెకో పిలకలా మెలిసిపోయింది.

పురటాలు ఒక బొప్పాసిచెట్టు నాధారం చేసుకు, అగొట్టాలంట చిమ్మెటల గొట్టినట్టు నీరు కొడుతూంటే, అటుతిరిగి ఇటుతిరిగి అన్ని కొమ్మలా తన బాహువులొంచి, రాహుకేతువు లిద్దరూ ఒక్కుమ్మడిపట్టి పాలార్చినట్టు ముఖం చూపెట్టసాగింది.

ఏలాగో, నానుడిలా, నాడిలా వ్యాపించిపోయింది నక మొకాల: "బొప్పాసిచెట్టుమీద ఆమె పురుడోసుకొంది" అంటే "పురుడోసుకొంది!" అని వెంటనే దేవలోకంలో విడ్డూరం! "మరి పాలకు కొదవలేద" ని మానవలోకంలో ప్రచారం! "ఇంతకూ పుట్టినపిల్ల ఏమైంది?" అని అడిగిన

పాపాన్ని ఒక్కడూ పోలేదు ఆ జనపద ప్రాంతాన్ని. అంతా వేళాకోళమాడినవారే—"ఈ జలఝుంఝూటనకుతోడు ఝంఝూమారుతంపీస్తే ఆ బొప్పాసిచెట్టు పసతెలిసేని!" అని. ఆమె మాత్రం, ఆ పురటాలుమాత్రం, "దేవుని ఘట్టి మనలో వున్నంతసేపు, ఏచెట్టయినా ఘట్టే ఏపుట్టయినా ఘట్టే!" అని జవాబుచెప్తూ పాటిమీద తన శిశువుకోసం నెమకులాడేనట!

అయితే శిశువు ఎవరిచేతనో రక్షింపబడిందని యూవళులోనే విన్నాం!—కాని తల్లియొడిలోకి చివరకొచ్చిందా? వస్తే ఏలావచ్చింది? అనే రెండు ప్రశ్నలకు సమాధానం ఈ కధగుండా రాదా? అదీ నా దుగ్ధ! ఇదీ విచికిడిమీదనే సాధించాలి! పాఠకులారా ఆలకించండి!

శిశువు నోచేత్తో రక్షిస్తూ, రెండవ చేతను అతదే ఒక పామును శిక్షించాడు. వరదలో ఎటుచూచినా పాములే! పాములంటే జ్ఞాపకం వచ్చేని. పట్నవాసపు రేవులో ఒక రావిచెట్టు, పెద్దచెట్టు, పైకొమ్మలు మాత్రంగా మిగిలివుంది. మిగిలివున్న కొమ్మలు లెక్కిస్తే ఒక వంద ఏభై యున్నాయి. మునిగిన కొమ్మలుకూడా కలిపితే ఎన్నివుండేనో! పైకొమ్మల్లోకంటా ఒక పాము ఎక్కింది, తన ప్రాణం తాను దక్కించుకుందామని. ప్రజలు ఆలా దాన్ని ప్రాణంతో పోనిస్తారా? పదిమంది పది కొమ్మలకూ ఎక్కి, "పాము-పాము" అని, అది ఆకొమ్మకూ ఈకొమ్మకూ పాకులాడుతూంటే, కఱ్ఱతో నీళ్ళమీద పడేటటు చేసి, నీళ్ళమీద వోదెబ్బ, పడగమీద వోదెబ్బ అన్నట్టు దబదిబా మొత్తేశారు. ఏముంది? పాము చచ్చింది! పట్నవాసంలో రేవు కాబట్టి సుళువుగా చావగొట్టారు. అదే పల్లెటి

ప్రాంతం అయితే, పది పాములు కలిసి బిరితెగినట్లు, చెరలాడి ఒక్కపాము వేయి మెలికలు తిరిగి, మీదిప్రాణం క్రిందకు వచ్చేటట్లు చేస్తుంది. ఏమానవుణ్ణయినాసరే ! అయితే నేవన్న ప్రత్యేకవ్యక్తి వున్నాడా, అతగాడు, సునాయాసంగా, అతి సునాయాసంగా, ఒకచేత్తో నాగుబాముసు చంపుతూ రెండో చేత్తో నామును రక్షించాడు గరుడుడా అన్నట్టు !

రక్షింపబడ్డ శిశువు కేరున అఱచి, కెవ్వున గెంతి ఒక పెట్టెలో పడ్డాడు. పెట్టెరో పడ్డాడూ అంటే దాని మూత తెఱచి వుండాలి ! పెట్టె తేల్తూవుండాలి ! సర్వసాధారణంగా పెట్టె నెవడైనా చేతపట్టుకు ప్రవాహంలో తేలి వస్తూవుంటే, " లాభం లేందే సెట్టి ఏటబడడు " అంటారు. కాని ఇక్కడ ఉత్తపెట్టీ, మూతతెఱచుకు, తేలిపోతూంటే, శిశువు కాబట్టి లాభం చూడ కుండా ప్రాభవమే చూచుకు అందులోకి పడ్డాడు. ఈ శిశువు పడ్డాడో లేదో పెట్టెమూత పడిపోయింది. శిశువుమాట పెట్టె మూతపడ్డం మాట మఱచి కొత్తమనిషి, పెట్టెలో బంగారు వస్తువు లుండివుండాల అనే అంచనాను మునిగీత ఈదేడు. పైకోగొలుసు ఒక కట్టడ కాసుల పేరు గజ్జెల వొడ్డాణం గమ్మత్తవ ఎత్తేడు. అవి పైకెత్తి వాటిని మెఱయించేలో ఈ పెట్టే శిశువూ అల్లంత దూరంపోయి అదృశ్యమయినాయి !

" టాకీ " " రీల్ " " కట్ " అయిపోయినట్లు, కొంత సేపు అగమ్యగోచరంగాను, అంధకార బంధురంగాను వుండి పోయింది నాకల ! నాకల నాకే నల్లగా కనబడసాగింది. మళ్ళీ కల అతుకోవడంలో ఒక " లేడీ డాక్టరు " కనబడింది. ఆమె కూడా జలజంతువులా నడుస్తూంది నీటిలో. ఆ నీరే అనుకోవాలి

ఈ సీరూను. ఎంచేతాంటే లేడీడాక్టరు ఎగ్గట్టు దిగుచాయను పై పెట్టె తాకినట్టయుంది. అట్టై చేతిలోని స్టైతెస్కోపు బుజమ్మీదకు విసురుకోని—ఆ పెట్టె నాపి మూతతీసి చూచింది. మరో నిమిషమలా వుండివుంటే ఆ రోజు రోజున్నరబిడ్డ ఉక్కిరి బిక్కిరై చచ్చేది! అని ముద్దులాడి, సుద్దులాడి బుజాన్నేసుకుంది బిడ్డణ్ణి! బిడ్డడి గుండెకాయయొక్క దెబ్బల్ని స్టైతస్కోపు దానంతటదే లెక్కిస్తూంది. బిడ్డకు మరి ఫరవాలేదని జగత్తు వూహించినట్టుగా జయశంఖారావం చేసింది.

విన్న సంగతైనా నమ్మదగినదిగా వుండాలి! వెంటనే అడిగాను ఒక ప్రశ్న! " నీవక్క డెలాగున్నావమ్మా!" అని లేడీడాక్టర్ను. ఆమె నన్ను చూస్తూ సిగ్గు వెంటనే అభినయించింది. " లేదు సార్! నావృత్తి సార్ అది! పురుళ్ళు పోయడం నావృత్తి సార్ " అంది. "వరదకు పురుడుపోయడం ఏమిటమ్మా?" అని పక్కున నవ్వాను. " మగవాడవు నీకేం తెలుస్తుంది ఆడవాళ్ల పడేపాట్లు?" అని ఆ లేడీడాక్టరు చిరునవ్వు నవ్వింది. " అయితే పిల్లనేంచేస్తారు?" అని అడిగాను. " తల్లి తెలియనప్పుడు తండ్రి తెలియనప్పుడు ' ఆర్ఫనేజి ' కి చేరుస్తాం " అంది లేడీడాక్టరు. " అది గొప్ప సంఘసేవే " అన్నాను నేను.

ఇలా మేమిద్దరం వరదలో మోకాళ్లోతునొకరం, మొల్లోతునొకరం ఎవరిని " హైహేల్డ్ షూస్పో " తెలియకుండా నిలబడి మాట్లాడుకుంటూ వున్నాం, పైన ఒక వాయువిమానం గిర్రున తిరిగినట్టయింది. ఆ వరదరోజుల్లో మహా తిరిగాయి లేండి అలాంటి యంత్రాలు. " ఆ వాయువిమానం నేలకుదిగి ఈబిడ్డణ్ణి తీసికొని ' ఆర్ఫనేజి ' కి చేర్చకూడదూ?" అంది లేడీ డాక్టరు.

" వాయువిమానంమీద వాళ్ల భూతద్దాల్తో చూడ్డానికి పుట్టారు. కాని బరువు మోయడానికి పుట్టలేదు " అన్నాను. " ఇలా తేండి బిడ్డణ్ణి " అంది తల్లి ఎక్కుణ్ణుంచో ; నా కళ్ళల్లో ఒక మెఱపు మెఱసింది.

" నీవు ఈ పిల్లణ్ణి ఈ వరదనీట కన్నావంటే నాకు నమ్మశక్యం గాకుండావుంది లేడీ డాక్టరు ! " బొప్పాసిచెట్టు సాక్షిగా !" అంది ఆ పురటాలు. " ఇన్ని చెట్లుండగా బొప్పాసి చెట్టునే సాక్ష్యం వేసుకుంటావేం ?" అని అడిగింది లేడీడాక్టరు. " అటువంటి భూజం మఱి వొకటి కానరాదేను !" అంది ఆ యిల్లాలు. " లేడీ డాక్టరు భుజంకూడా అలాంటిదే" అన్నాను నేను. " నాభుజం ! నాభుజం ! అదో ఎటర్నల్ అర్ఫనేజి ! తల్లితండ్రులులేని బిడ్డలకు శాశ్వత పుట్టిల్లు !" అంది " అది ఎట్లా ?" అన్నాను ఎటకారంగా ఆమెకేసి చూస్తూ ! ఆమె అతివాస్తవికంగా తనకళ్ళల్లోకి కాంతినింపుకొని, "ఏబిడ్డకు తల్లివున్నా, ఏబిడ్డకు తండ్రివున్నా, ఈబిడ్డకుమాత్రం ఎన్నడూ తండ్రిలేడు ! దేవునికొడుకు ఈతడు. ఈతడు జీసస్ !" అని ఒక చిహ్నాన్ని తన బుజంమీద చూపించిందై-"ఇతణ్నెప్పుడూ ఈ బుజంమీద నేను మోసేను—వరదప్పుడు, వానప్పుడు, వయసప్పుడు, వార్ధక్యమప్పుడు !" అంది.

" దేవుని యెడల నమ్మకం అంటే అలా వుండాలి !" అన్నాను వెంటనే ఎదో భావనాగరిమను ఆ లేడీ డాక్టరు కళ్ళ ల్లోని నునుకాంతి నొక్కింత చూఱగొంటూ.

కాని లోకం " కన్నాను " అని అనదుగా ! "విన్నాను" అనే అంటుంది—" దేవుడూలేడు దయ్యమూలేదు. బొప్పాసి

చెట్టు అప్పా! నే విన్నాను అప్పా! నీళ్ళొదింది బొప్పాసిచెట్టు అప్పా!" అని లోకం అన్నట్టయింది, వరదలో కొట్టుకుపోతూ.

మేము చూస్తుంగందా! మాపాదాల క్రింద మట్టి ప్రవాహం లేదు. మాంచి! మిలమిలా! మెఱిసిపోయే గంద్రిసుక జరజరా మంది. నేపరున్న చోటు చోటూ జరిగినట్టయింది!

మెలకువగొన్నాను! కలను కలకాలం నిలపాలని ఈకథ ఇలా వ్రాశాను.

.... .... .... .... ....

## ఇమ్ప్రెషన్

కలుపుతీతలా, కొందరి కొందర్ని, ఈ ప్రపంచంలోంచి తీసేస్తే, లోకం కిన్నెరలోకమో, కింపురుషలోకమో కాగలదని నా నమ్మకము. అయితే ఆ కొందరితోపాటు కొన్ని కొన్ని అసహ్యపు స్థలాలుకూడా అంతరించిపోవాలి. ఉదాహరణకు మదరాసు బకింగుహాము కాలువ. కాలువ ఎండిపోనక్కరలేదు. కంపు పోతే చాలు. ఎంత షోకేశాముక్కగాడికైనా అదృశ్యం దరిశేలో ముక్కు ముయ్యకమానడు. ఇలాగ్గానే ఒక్కొక్కచో స్యూయేజు ఒక్కొక్కతో "స్లమ్సు." ఇదంతా నిర్మూలనంచేసి నీటు కూర్చ లేనప్పుడు, ఈ వాయువిమానాల పరువుళ్ళ కయ్యేటటువంటి ఈప్రదర్శనాల వైభోగాల కయ్యేటటువంటి దూబరాఖర్చు ఎవరి కోసం, ఎందుకోసం? అని అనిపిస్తుంది. పట్నంలో ఏకనీటు, ఏకగోటు వెలయించినప్పుడే పట్నం అందం ఆనందమూను!